పీఎస్ఎల్వీ సీ-59 ప్రయోగం నేటికి వాయిదా

శ్రీహరికోట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టాల్సిన పీఎస్ఎల్వీ సీ-59 రాకెట్ ప్రయోగం వాయిదా పడింది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి బుధవారం సాయంత్రం 4.08 గంటలకు చేపట్టాలనుకున్న ఈ రాకెట్ ప్రయోగాన్ని గురువారం సాయంత్రం 4.12 గంటలకు నిర్వహించనున్నట్లు ఇస్రో ప్రకటించింది. పీఎస్ఎల్వీ సీ-59 ద్వారా నింగిలోకి పంపాల్సిన ప్రోబా-3 ఉపగ్రహంలో సాంకేతిక లోపం ఏర్పడటమే ఈ వాయిదాకు కారణమని వెల్లడించింది. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి ప్రోబా-3లో రెండు ఉపగ్రహాలు (310 కిలోల బరువైన కరోనాగ్రాఫ్, 240 కిలోల బరువైన ఆక్యుల్టర్) ఉంటాయి. సూర్యుడి గుట్టు విప్పేందుకు కృత్రిమ గ్రహణాన్ని సృష్టించడం, తద్వారా సూరుడి బాహ్య వాతావరణమైన కరోనాను అధ్యయనం చేయడం ప్రోబా-3 లక్ష్యం.

స్వర్ణ దేవాలయంలో సుఖ్‌బీర్‌పై హత్యాయత్నం

ఖలిస్థాన్ మాజీ ఉగ్రవాది అరెస్ట్

చండీగఢ్: పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రి, శిరోమణి అకాలీదళ్ అధినేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై అమృత్‌సర్ స్వర్ణ దేవాలయంలో హత్యాయత్నం జరిగింది. వీల్ చైర్‌లో ఉండి శిక్షలో భాగంగా సేవాదార్ (కాపలాదారుడు)గా సేవలో ఉన్న ఆయనపై బుధవారం ఖలిస్థాన్ మాజీ ఉగ్రవాది కాల్పులు జరిపాడు. అయితే అక్కడ సాధారణ దుస్తుల్లో ఉన్న భద్రతా సిబ్బంది అప్రమత్తమై అతడిని అడ్డుకోవడంతో బుల్లెట్ గురితప్పి పక్కనే ఉన్న గోడకు తగిలింది. వెంటనే నిందితుడి నుంచి మారణాయుధాన్ని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. కాల్పుల అనంతరం సుఖ్ బీర్ తన శిక్షను కొనసాగించారు.

అస్సాంలో బీఫ్‌పై నిషేధం: సీఎం హిమంత

న్యూఢిల్లీ: బీఫ్ వడ్డన, వాడకంపై నిషేధం విధించాలని అస్సాం ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, బీఫ్ వినియోగానికి సంబంధించిన చట్టాన్ని సవరించాలని క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించామన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, బహిరంగ ప్రదేశాల్లో బీఫ్ వడ్డన, వినియోగంపై నిషేధం విధిస్తామని చెప్పారు.

సీఏపీఎఫ్, ఏఆర్‌లలో లక్షకుపైగా ఖాళీలు

న్యూఢిల్లీ: కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సీఏపీఎఫ్), అస్సాం రైఫిల్స్ (ఏఆర్)లో లక్షకుపైగా ఖాళీలు ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం బుధవారం రాజ్యసభలో వెల్లడించింది. సెప్టెంబర్ 30 నాటికి సీఏపీఎఫ్, ఏఆర్‌లలో మొత్తం 9,48,204 మంది సిబ్బంది ఉన్నట్లు కేంద్ర హోంశాఖ గణాంకాలు చెప్తున్నాయి. ఖాళీలను త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ తెలిపారు.

రిటైర్మెంట్ వయసును పెంచే యోచన లేదు

కేంద్రప్రభుత్వం స్పష్టీకరణ

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వోద్యోగుల పదవీ విరమణ వయసులో మార్పులు చేసే ప్రతిపాదన పరిశీలనలో లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ బుధవారం సమాధానం చెప్పారు. ప్రభుత్వ వ్యవహారాలకు అనుగుణంగా అవసరం మేరకు సివిల్ సర్వీసుల్లో యువతకు ఉద్యోగాలు ఇవ్వడానికి విధానాలను రూపొందిస్తున్నామని తెలిపారు.

రూ.100 టికెట్‌లో ప్రయాణికులు చెల్లిస్తున్నది రూ.54 మాత్రమే

రైల్వే మంత్రి వెల్లడి

న్యూఢిల్లీ: అన్ని వర్గాల ప్రయాణికులకు కలిపి భారతీయ రైల్వే ప్రతి ఏడాది రూ. 56,993 కోట్లను టికెట్లపై రాయితీగా అందిస్తున్నట్లు రైల్వే మంత్రి అశ్వనీవైష్ణవ్ బుధవారం తెలిపారు. ప్రతీ టికెట్‌పైనా 46 శాతం రిబేటు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. లోక్‌సభలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. టికెట్ ధర రూ.100 అనుకుంటే అందులో రూ.54 మాత్రమే ప్రయాణికుల నుంచి వసూలు చేసి మిగతా రూ.46ను రాయితీ ఇస్తున్నట్లు వివరించారు.

మహారాష్ట్ర సీఎంగా ఫడ్నవీస్

- బీజేపీఎల్పీ నేతగా ఏకగ్రీవంగా ఎన్నిక
- నేడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం
- డిప్యూటీ సీఎంలుగా షిండే, అజిత్‌పవార్
- ఎట్టకేలకు పట్టువీడిన ఏక్‌నాథ్ షిండే

ముంబై, డిసెంబర్ 4: మహారాష్ట్రలో పది రోజుల ఉత్కంఠకు తెరపడింది. కొత్త ముఖ్యమంత్రిగా బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్(54) పేరు ఖరారైంది. ఈ మేరకు బీజేపీ అధిష్ఠానం ఎట్టకేలకు నిర్ణయం తీసుకుంది. దీంతో బుధవారం విధాన్ భవన్‌లో జరిగిన సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యేలు ఆయనను బీజేపీ ఎల్పీ నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫడ్నవీస్ ముఖ్యమంత్రి కానున్నారని, మహారాష్ట్రలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడుతున్నట్టు బీజేపీ పరిశీలకులు, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, విజయ్ రూపాని ప్రకటించారు. దీంతో ఫడ్నవీస్, ఏక్‌నాథ్ సిండే, అజిత్ పవార్ నేతృత్వంలోని మహాయుతి ప్రతినిధి బృందం బుధవారం సాయంత్రం గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరింది. గురువారం సాయంత్రం 5.30 గంటలకు దక్షిణ ముంబైలోని ఆజాద్ మైదాన్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా మూడోసారి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు.

ఉప ముఖ్యమంత్రులుగా షిండే, పవార్

ఫడ్నవీస్‌తో పాటు ఉప ముఖ్యమంత్రులుగా శివసేన నేత, మాజీ సీఎం ఏక్‌నాథ్ షిండే, ఎన్సీపీ నేత అజిత్ పవార్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఉప ముఖ్యమంత్రి పదవి తీసుకునేందుకు మొదట షిండే మొండికేశారు. ఆయనను డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించాల్సిందిగా బీజేపీ అధిష్ఠానం, ఫడ్నవీస్ పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఆయన స్పందించలేదు. చివరకు బుధవారం సాయంత్రం అంగీకరించిన షిండే.. ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తానని ప్రకటించారు.

కార్పొరేటర్ నుంచి ముఖ్యమంత్రి వరకు..

మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్ మూడోసారి ప్రమాణస్వీకారం చేస్తున్నారు. దేవేంద్ర ఫడ్నవీస్ తండ్రి గంగాధర్ ఫడ్నవీస్ జనసంఘ్, బీజేపీలో చురుగ్గా పని చేశారు. 1989లో ఏబీవీపీ ద్వారా విద్యార్థి రాజకీయాల్లోకి ప్రవేశించిన ఫడ్నవీస్ 22 ఏండ్ల వయసులోనే నాగ్‌పూర్ కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. 1997లో 27 ఏండ్లకే మేయర్‌గా బాధ్యతలు స్వీకరించారు. 1999 నుంచి వరుసగా ఎమ్మెల్యేగా గెలుస్తూ వచ్చిన ఆయన 2014లో మొదటిసారి మహారాష్ట్ర సీఎం అయ్యారు. 2019 నవంబర్ 23న రెండోసారి సీఎంగా ప్రమాణం చేసినా, సరిపడా శాసనసభ్యుల బలం లేకపోవడంతో మూడు రోజులకే రాజీనామా చేశారు. 2022 జూన్‌లో శివసేనలో షిండే తిరుగుబాటు చేసి సీఎం అయిన తర్వాత, ఫడ్నవీస్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు తీసుకున్నారు.

మాతృమూర్తి పేరు జత చేసి..

ప్రమాణస్వీకార కార్యక్రమం కోసం ముద్రించిన ఆహ్వానపత్రికల్లో ఫడ్నవీస్ పేరులో మార్పు కనిపించింది. ఇప్పటివరకు ఆయన పేరు దేవేంద్ర గంగాధర్ ఫడ్నవీస్ అని ఉండేది. ఫడ్నవీస్ తండ్రి గంగాధర్. ఎన్నికల అఫిడవిట్‌లలోనూ, గతంలో ప్రమాణస్వీకారం చేసినప్పుడు ఫడ్నవీస్ ఇదే పేరుతో చేశారు. ఈసారి మాత్రం ఆయన పేరును 'దేవేంద్ర సరిత గంగాధర్‌రావు ఫడ్నవీస్'గా ముద్రించారు. ఫడ్నవీస్ తల్లి పేరు సరిత.

అజిత్ పవార్‌కు షిండే చురకలు

ఎన్సీపీ నేత అజిత్ పవార్‌ను ఉద్దేశించి మహారాష్ట్ర ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. బుధవారం గవర్నర్‌ను కలిసిన తర్వాత ఫడ్నవీస్, షిండే, పవార్ కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. డిప్యూటీ సీఎం పదవిపై తన నిర్ణయాన్ని సాయంత్రం కల్లా చెప్తానని షిండే పేర్కొన్నారు. షిండేకు అడ్డుపడిన అజిత్ పవార్.. తాను మాత్రం ప్రమాణస్వీకారం చేస్తానని, షిండేకు సాయంత్రం వరకు తెలిసొస్తుందని వ్యాఖ్యానించారు. దీనికి స్పందించిన షిండే.. అజిత్ పవార్‌కు ఉదయం, సాయంత్రం ప్రమాణస్వీకారం చేసిన అనుభవం ఉందంటూ చురకలంటించారు. 2019లో ఎన్సీపీలో అజిత్ పవార్ తిరుగుబాటు చేసిన సంఘటనను గుర్తుచేస్తూ షిండే ఈ వ్యాఖ్యలు చేశారు. అప్పుడు ఫడ్నవీస్ సీఎం, అజిత్ పవార్ ఉపముఖ్యమంత్రిగా తెల్లవారుజామున ప్రమాణం చేశారు.

గ్యాస్ట్రిక్ బెలూన్‌తో ఊబకాయానికి చెక్

సిలికాన్ బెలూన్ తయారుచేసిన అమెరికా పరిశోధకులు

కడుపును నిండుగా ఉంచి.. తక్కువ తినేలా చేస్తుంది!

న్యూయార్క్: ఊబకాయాన్ని తగ్గించేందుకు ఉపయోగపడే కొత్త గ్యాస్ట్రిక్ బెలూన్‌ను అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ)కి చెందిన పరిశోధకులు రూపొందించారు. సిలికాన్‌తో తయారుచేసిన ఈ బుడగను కడుపులోకి పంపించి, ఆహారం తక్కువ తినేలా చేయవచ్చు. తద్వారా శరీర బరువును అదుపులో ఉంచుకోవచ్చు. ఈ గ్యాస్ట్రిక్ బెలూన్‌కు సంబంధించిన వివరాలు 'డివైజ్' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఇప్పటివరకు ఉన్న గ్యాస్ట్రిక్ బెలూన్‌లను ఊబకాయుల కడుపులోకి పంపించి సెలైన్ నింపుతారు. దీంతో వారి కడుపు నిండుగా అనిపించి ఆహారం తక్కువ తీసుకుంటారు. అయితే, ఒకసారి ఈ బుడగ ఉన్నట్టు శరీరం అలవాటు చేసుకుంటే దీని సమర్థత తగ్గిపోతుంది. ఈ నేపథ్యంలో ఎంఐటీకి చెందిన ఇంజినీర్లు కొత్త డిజైన్‌తో గ్యాస్ట్రిక్ బెలూన్‌ను అభివృద్ధి చేశారు.

కడుపు లోపల బెలూన్.. బయట పంప్

సిలికాన్‌తో చేసిన ఈ బెలూన్‌ను కడుపులోకి పంపించిన తర్వాత ఆహారం తీసుకునే ముందు గాలి ఊదాలి. దీంతో తినే ఆహార పరిమాణం తగ్గుతుంది. తిన్న తర్వాత బెలూన్ నుంచి గాలి తీసేయాలి. ఇలా చేయడం వల్ల మిగతా గ్యాస్ట్రిక్ బెలూన్ల కంటే ఎక్కువగా కాలం ఈ బెలూన్ సమర్థంగా పని చేస్తుందని ఎంఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ జియోవన్ని ట్రావెర్సో తెలిపారు. నోటితో ఆహారం తీసుకోలేని వారికి ఫీడింగ్ ట్యూబ్‌ను కడుపులోకి పంపించినట్టుగానే ఈ గ్యాస్ట్రిక్ బెలూన్‌ను కూడా పంపిస్తారు. దీనికి అనుసంధానంగా బయట చర్మానికి ఒక చిన్న పంప్‌ను ఏర్పాటుచేస్తారు. దీని ద్వారా కడుపు లోపలి బెలూన్‌లోకి అవసరమైనప్పుడు గాలి పంపించొచ్చు లేదా తీసేయొచ్చు. ఈ బుడగను జంతువులపై ప్రయోగాలు జరపగా, అవి తినే ఆహారం 60 శాతం మేర తగ్గిపోయిందని తేలింది. ప్రస్తుత ఊబకాయ చికిత్సలు ఫలించని వారికి ప్రత్యామ్నాయంగా ఈ గ్యాస్ట్రిక్ బెలూన్‌ను వినియోగించవచ్చని పరిశోధకులు చెప్తున్నారు.

మొబైల్ మాల్‌వేర్ దాడుల్లో భారత్ టాప్

- ప్రపంచంలో 28శాతం భారత్‌లోనే
- థ్రెట్ ల్యాబ్జ్-2024 నివేదిక

న్యూఢిల్లీ, డిసెంబర్ 4: మొబైల్ మాల్‌వేర్ దాడుల్లో భారత్ టాప్‌లో నిలిచింది. గతంతో పోల్చితే భారత్ ర్యాంకింగ్ మరింత దిగజారింది. సైబర్ ముప్పు, బెదిరింపుల్లో అమెరికా, కెనడాలను భారత్ దాటిపోయిందని 'ద స్కేలర్ థ్రెట్ ల్యాబ్జ్-2024' తాజా నివేదిక పేర్కొన్నది. డిజిటల్ పరివర్తన, పెరుగుతున్న సైబర్ బెదిరింపుల నేపథ్యంలో భారతీయ సంస్థలు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాల్సిన అవసర ముందని నివేదిక తెలిపింది. ఈ నివేదిక ప్రకారం, ప్రపంచంలో మొత్తం మొబైల్ మాల్‌వేర్ దాడుల్లో 28 శాతం భారత్‌లో చోటుచేసుకోగా, ఇది అమెరికాలో 27.3 శాతం, కెనడాలో 15.9 శాతంగా ఉంది. జూన్ 2023 నుంచి మే 2024 మధ్యకాలంలో 2,000 కోట్ల మొబైల్ లావాదేవీలకు సంబంధించిన రిస్క్, సైబర్ బెదిరింపుల డాటాను విశ్లేషించి ఈ నివేదికను రూపొందించారు. మాల్‌వేర్ అన్నది.. కంప్యూటర్ వైరస్, వార్మ్స్, ట్రోజన్ హార్స్, రాన్సమ్‌వేర్, స్పైవేర్..మొదలైన హానికరమైన సాఫ్ట్‌వేర్ ప్రోగామ్స్‌ను యూజర్లకు తెలియకుండానే వారి మొబైల్ ఫోన్లలోకి పంపుతారు. దీంతో ఆ మొబైల్ ఫోన్లలోని సున్నితమైన, వ్యక్తిగత డాటాను సైబర్ నేరగాళ్లు దొంగలిస్తారు.

సిద్ధరామయ్యకు బిగుస్తున్న ముడా ఉచ్చు

చర్యలకు సిద్ధమవుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్

బెంగళూరు: కర్ణాటకలోని కాంగ్రెస్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) భూ కుంభకోణం ఉచ్చు మరింత బిగుసుకుంటున్నది. వందల కోట్ల రూపాయల కుంభకోణంలో ఆయన పాత్ర, ప్రమేయంపై ముఖ్యమైన ఆధారాలు లభ్యం కావడంతో ఆయనపై చర్యలు చేపట్టేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సిద్ధపడుతున్నది. సీఎం అక్రమాలపై పిటిషనర్ స్నేహమయి కృష్ణ తమకు ఫిర్యాదు చేసిన అనంతరం ఈడీ అధికారులు సీఎం నగదు వ్యవహారాలు, హవాలా కార్యకలాపాలకు సంబంధించిన ఆధారాలను సేకరించారు. అంతేకాకుండా తమకు లభ్యమైన ఆధారాలను ఉటంకిస్తూ ఈడీ అధికారులు.. కర్ణాటక లోకాయుక్తకు ఒక లేఖ కూడా రాశారు. ముడాకు సంబంధించి అనేక స్థలాలను సిద్ధరామయ్య కుటుంబ సభ్యులు, ఆయన అనుచరులకు అక్రమంగా కట్టబెట్టినట్టు ఈడీ ఆధారాలు సేకరించింది. ఇప్పటికే ఆర్‌టీఐ కార్యకర్త గంగరాజు కూడా కీలక ఆధారాలను ఈడీకి సమర్పించారు.

అధికారం పంపకంపై డీకేతో ఎలాంటి ఒప్పందం లేదు

అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యం.. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

మాండ్య: కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రాక ముందు తనకు, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు మధ్య అధికారం పంచుకోవడంపై ఎలాంటి ఒప్పందం జరగలేదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు. అయితే కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. 'ముఖ్యమంత్రి ఏది చెబితే అదే ఫైనల్' అంటూ శివకుమార్ చేసిన ప్రకటనపై ఆయన స్పందిస్తూ పై వ్యాఖ్యలు చేశారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై ఆయన మాట్లాడుతూ అది ఇప్పుడు లేదని చెప్పారు. అధిష్ఠానం ఆదేశాల మేరకే తాను నిర్ణయం తీసుకుంటానని అన్నారు. కాగా, గురువారం హసన్‌లో కాంగ్రెస్ పార్టీ, స్వాభిమానిగల ఒక్కుట (అణగారిన వర్గాల సమాఖ్య సంస్థలు) సంయుక్తంగా సదస్సు నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. ముడా కుంభకోణంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న సిద్ధరామయ్యకు సంఘీభావంగా అణగారిన వర్గాల సమాఖ్య సంస్థలు ఈ సదస్సు నిర్వహించాలని భావించినా, దాని నిర్వహణలో కాంగ్రెస్ భాగస్వామి అయ్యి సంయుక్తంగా నిర్వహిస్తుండటంతో సిద్ధూ బల ప్రదర్శనకు గండిపడిందని భావిస్తున్నారు.

5 రోజుల పనిదినాలు ఇప్పట్లో లేనట్టే!

- కేంద్రంపై బ్యాంకు ఉద్యోగుల అసంతృప్తి
- నిరసనలకు సిద్ధమవుతున్న యూనియన్లు

ముంబై, డిసెంబర్ 4: ఐదు రోజుల పనిదినాలను కేంద్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టడం పట్ల బ్యాంకు ఉద్యోగులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు త్వరలో నిరసనలకు దిగాలని భావిస్తున్నారు. బ్యాంకు ఉద్యోగులకు వారానికి ఐదు రోజులే పని ఉండేలా ఇండియన్ బ్యాంకర్స్ అసోసియేషన్(ఐబీఏ), బ్యాంకు ఉద్యోగ సంఘాల మధ్య ఒప్పందం జరిగింది. ఇందుకు గానూ ప్రతిరోజూ బ్యాంకు ఉద్యోగులు 40 నిమిషాలు ఎక్కువ పని చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ ప్రతిపాదనకు కేంద్ర ఆర్థిక శాఖ తుది అనుమతి ఇవ్వాల్సి ఉంది. 2015 నుంచి బ్యాంకు ఉద్యోగులు ఈ విధానం కోసం డిమాండ్ చేస్తున్నారు.దీంతో త్వరలోనే పోరాటం ప్రారంభించాలని భావిస్తున్నామని, ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి రాయ్ పేర్కొన్నారు.

పురుషులకు నెలసరి వస్తే అప్పుడు తెలుస్తుంది!

మధ్యప్రదేశ్ హైకోర్టుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

ఆరుగురు మహిళా న్యాయమూర్తుల తొలగింపును తప్పబట్టిన ధర్మాసనం

న్యూఢిల్లీ, డిసెంబర్ 4: మధ్యప్రదేశ్‌లోని హైకోర్టులో నెమ్మదిగా పనిచేస్తున్నారంటూ ఆరుగురు మహిళా న్యాయమూర్తులను విధుల నుంచి తొలగించడంతో పాటు వారి పునర్నియామకానికి తిరస్కరించడం పట్ల సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ఒక వేళ పురుషులు కనుక నెలసరి వస్తే ఈ బాధ అర్థమై ఉండేది' అని వ్యాఖ్యానించింది. 'పురుషులకూ రుతుక్రమం ఉండాలని నేను కోరుకుంటున్నాను. అప్పుడే వారికి మహిళల బాధ తెలుస్తుంది' అని ధర్మాసనానికి నేతృత్వం వహించిన జస్టిస్ బీవీ నాగరత్న అన్నారు. మహిళా జడ్జీల తొలగింపు విషయంలో హైకోర్టు వైఖరిని సుప్రీం కోర్టు తప్పుబడుతూ కేసును సుమోటోగా స్వీకరించినట్టు తెలిపింది. 'ముఖ్యంగా మహిళలు విధి నిర్వహణలో శారీరకంగా, మానసికంగా ఇబ్బంది పడుతుంటే, నెమ్మదిగా ఉన్నారంటూ వారిని ఇంటికి పంపకండి. పురుష న్యాయమూర్తులు, న్యాయాధికారులకు ఒకే ప్రమాణాలు ఉండనివ్వండి. అప్పుడు ఏం జరుగుతుందో, మీరు జిల్లా న్యాయవ్యవస్థలో లక్ష్యాన్ని ఎలా సాధించగలరో మాకు తెలుసు' అని పేర్కొంది. 'ఏదైనా కేసును డిస్మిస్-డిస్మిస్ అని ఇంటికి వెళ్లిపోవచ్చు. మేము విచారిస్తున్న ఈ కేసు కూడా నెమ్మదిగా సాగుతున్నదని న్యాయవాదులు అనగలరా' అని ప్రశ్నించింది. కేసు తదుపరి విచారణను ఈ నెల 12కి వాయిదా వేసింది.

రైతుల గోడు పట్టదా?

- రైతులతో చర్చలు ఎందుకు జరపడం లేదు?
- గతంలో చేసిన వాగ్దానాలు ఏమయ్యాయి?
- కేంద్రప్రభుత్వాన్ని నిలదీసిన ఉప రాష్ట్రపతి ధన్‌ఖర్
- అన్నదాతల సమస్యలపై ప్రతిపక్షాలు మొసలి కన్నీరు కారుస్తున్నాయని ధ్వజం

న్యూఢిల్లీ: తమ డిమాండ్ల సాధన కోసం దీర్ఘ కాలంగా నిరసన తెలియచేస్తున్న రైతుల గోడును పట్టించుకోనందుకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతాంగంలో పెరుగుతున్న అసంతృప్తి పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేస్తూ వెంటనే రైతులతో చర్చలు ప్రారంభించాలని పిలుపునిచ్చారు. బుధవారం ఒక కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి ప్రసంగిస్తూ.. ఇది చాలా తీవ్రమైన విషయమని, దీన్ని తేలికగా తీసుకుంటున్నామంటే మనం దీనిపై ఆచరణాత్మకంగా లేమని, మన విధానాల రూపకల్పన సరైన పంథాలో లేదని భావించాలని స్పష్టం చేశారు. గతంలో రైతులకు చేసిన వాగ్దానాలను రికార్డులలో భద్రపరిచారా? అని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ఆయన సూటిగా ప్రశ్నించారు. రైతుల సమస్యలను చర్చల రూపంలో ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. రైతులకు గత వ్యవసాయ మంత్రులు లిఖితపూర్వకంగా ఏవైనా వాగ్దానాలు చేశారో లేదో చెప్పాలని ఆయన శివరాజ్‌ను నిలదీశారు. ప్రపంచ స్థాయిలో భారత్ ప్రతిష్ట పెరుగుతున్నప్పటికీ దేశంలో మాత్రం ప్రభుత్వానికి రైతులకు మధ్య దూరం పెరిగిపోవడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచం ఎదుట భారత ప్రతిష్ట ఈ స్థాయిలో అత్యున్నతంగా ఏనాడూ లేదని, కాని రైతులు మాత్రం ఎందుకు ఆగ్రహంతో ఉన్నారని ధన్‌ఖర్ ప్రశ్నించారు. రైతుల్లో ఎందుకు నిరాశా నిస్పృహలు ఏర్పడ్డాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను విస్మరించడం వల్ల దేశంలో తీవ్ర పరిణామాలు సంభవిస్తాయని ఆయన హెచ్చరించారు

రైతులను విస్మరిస్తే భారీ మూల్యం తప్పదు..

రైతుల గొంతును ఏ శక్తి అణచివేయలేదని, రైతు సహనాన్ని పరీక్షించాలని ప్రయత్నిస్తే భారీ మూల్యాన్ని చెల్లించుకోవలసి వస్తుందని ధన్‌ఖర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతు బిడ్డనని చెప్పుకోవడానికి తాను గర్విస్తానన్నారు. దేశాన్ని సమైక్యపరచడంలో తన బాధ్యతను అత్యద్భుతంగా నిర్వర్తించిన దేశ తొలి హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను కేంద్ర వ్యవసాయ మంత్రికి గుర్తు చేశారు. ఇప్పుడు ఈ సవాలు మీ ముందున్నదని, ఇది భారతదేశ సమైక్యత కన్నా తక్కువ దేమీ కాదని ఆయన శివరాజ్ సింగ్‌ను ఉద్దేశించి పేర్కొన్నారు. రైతుల పరిస్థితులను మెరుగుపరచడంలో భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి(ఐసీఎంఆర్) వంటి వ్యవసాయ సంస్థలు విఫలమయ్యాయని ఆయన తెలిపారు. అవి సజీవంగా ఉండి తమ సేవలను అందచేసి ఉంటే దేశంలో రైతులకు ఈ పరిస్థితి వచ్చేది కాదని అభిప్రాయపడ్డారు. కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)కి చట్టబద్ధత కల్పించడంతోపాటు పంట నష్టపరిహారం, ఇతర ప్రయోజనాలు కోరుతూ మంగళవారం ఆందోళన చేపట్టిన రైతులను నోయిడాలో పోలీసులు అరెస్టు చేసిన నేపథ్యంలో మోదీ ప్రభుత్వంపై ఉప రాష్ట్రపతి ఈ స్థాయిలో విమర్శలు గుప్పించడం చర్చనీయాంశమైంది. మరోవైపు బుధవారం విపక్షాలపై కూడా ధన్‌ఖర్ విమర్శలు గుప్పించారు. రైతు సమస్యల పట్ల ప్రతిపక్షాలు మొసలి కన్నీరు కారుస్తున్నాయని మండిపడ్డారు. మోదీ సర్కారు రైతు వ్యతిరేకం అంటూ రాజ్యసభలో ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేయడంపై ఆయన స్పందిస్తూ.. కేవలం నినాదాలు, మొసలి కన్నీరుతో రైతు సమస్యలు పరిష్కారం కావన్నారు. గత వారం రోజులుగా సభా కార్యక్రమాలను విపక్షాలు అడ్డుకుంటున్నాయని, కానీ అది రైతుల సమస్యలపై కాదని అన్నారు.

దక్షిణ కొరియా అధ్యక్షుడిపై అభిశంసన తీర్మానం

మార్షల్ లా విధింపుపై వెనక్కి తగ్గిన అధ్యక్షుడు

సియోల్: దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్, ప్రతిపక్షాలకు మధ్య రేగిన వివాదం పతాక స్థాయికి చేరుకుంది. బుధవారం అధ్యక్షుడు యోల్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు పార్లమెంట్‌లో అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. యోల్ పదవీచ్యుతుడు కావటం ఖాయంలా కన్పించింది. ఈలోపు అధ్యక్ష పదవి నుంచి యోల్ తప్పుకుంటారన్న వార్తలు వెలువడ్డాయి. యోల్, రక్షణమంత్రి కిమ్ యోంగ్ సహా క్యాబినెట్ మంత్రులంతా రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నారని వారు చెప్పారు. మంగళవారం రాత్రి క్యాబినెట్ సమావేశం అనంతరం యోల్ మార్షల్ లా విధింపుపై వెనక్కి తగ్గారు. మార్షల్ లా విధింపును వ్యతిరేకిస్తూ తీసుకొచ్చిన తీర్మానాన్ని పార్లమెంట్ ఏకగ్రీవంగా ఆమోదించింది.



భూమిపైకి దూసుకొచ్చిన గ్రహశకలం

చిన్న సైజుది కావడంతో తప్పిన ముప్పు

లండన్, డిసెంబర్ 4: భూమిపైకి ఒక చిన్న గ్రహశకలం దూసుకొచ్చింది. మంగళవారం ఈశాన్య సెర్బియాపైన ఇది భూమి వాతావరణంలోకి ప్రవేశించింది. కేవలం 27 ఇంచుల సైజులో, 70 సెంటీమీటర్ల వ్యాసంతో ఉన్న ఈ గ్రహశకలానికి కొవెప్‌సీ5గా నామకరణం చేశారు. గ్రహశకలం భూమి మీదకు రావడానికి 12 గంటల ముందే యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ హెచ్చరిక జారీ చేసింది. అయితే, చిన్న సైజులో ఈ గ్రహశకలం ఉన్నందున ఎలాంటి ముప్పు ఉండబోదని చెప్పింది. ఊహించినట్టుగానే భూమి వాతావరణంలోకి చేరగానే ఈ గ్రహశకలం కాలిపోయింది. యాకుట్స్క్, ఒలెక్మిన్స్క్ ప్రాంతాల ప్రజలకు ఆకాశంలో వెలుగుతూ కనిపించింది. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

ఉద్యోగం కోసం యుద్ధాన్ని లెక్కచేయక!

- యూపీ యువత.. ఇజ్రాయెల్ బాట